www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 సెప్టెంబర్ 2025
5
కాకినాడ



నేడు, రేపు విఆర్ఎల ఆందోళన

ప్రజాశక్తి - పెద్దాపురం

చిరకాలంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18, 19 తేదీల్లో తహశీల్దారు కార్యాలయం వద్ద, 20న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, 22న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు విఆర్ఎల అసోసియేషన్ అధ్యక్షుడు దువ్వాపు వీరబాబు అన్నారు. ఈ ధర్నాలకు సంబంధించి అనుమతి కోరుతూ బుధవారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మికి, ఎస్ఐ వి.మౌనికకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విఆర్ఎకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన విఆర్ఎలకు ప్రమోషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరపల్లి రామలింగేశ్వర రావు, నూకతట్టు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగానే 'ఉపాధి'

- పనులు లేక కార్మికుల పస్తుల
- పూర్తిస్థాయిలో అందని వేతనాలు
- పనుల కల్పనలో యంత్రాంగం నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి కోసం వామపక్షాల ఒత్తిడితో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చి అమలు చేస్తోంది. దీన్ని చట్టంగా కూడా రూపొందించారు. అడిగిన వారందరికీ పనులు కల్పించడమే లక్ష్యంగా ఈ పథకం నడుస్తోంది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందా అనే అనుమానాలను పలువురు వ్యవసాయ కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. వారాలు, నెలలు తరబడి వేతనాలను పెండింగ్‌లో ఉంచుతోంది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ పనులు ఉన్నాయన్న నెపంతో పలుచోట్ల అధికారులు ఉపాధి పనులు చెప్పడం లేదు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కార్మికులు పొట్టకూటి కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో 2,91,376 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1,26,475 జాబ్ కార్డుదారులు రెగ్యులర్‌గా పనులకు వెళుతున్నారు. వీటి పరిధిలో 1.71 లక్షల వేతనదారులు ఉన్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున రూ.282 చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి అధికారులు పనులు కల్పించ లేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలి. 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా వేతనాలు అందించాలి. కనీస వేతనంగా రూ.300 ఇవ్వాలి. పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. మేట్‌లకు పారితోషికం ఇవ్వాలి. కానీ ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. 100 రోజుల పని దినాలు ప్రశ్నార్థకంగా మారాయి. 15 రోజులకు ఒకసారి కాక 15 వారాలకు ఒకసారి వేతనాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. సగటు కనీస వేతనం రూ.250 మించి రావడం లేదు. పని ప్రదేశంలో సదుపాయాలు కరువయ్యాయి. మేట్‌లకు పారితోషికాలు ఇవ్వడం లేదు. ఇలా అనేక సమస్యల నడుమ ఉపాధి హామీ చట్టం అరకొరగానే అమలవుతోంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

పనులకు డిమాండ్ ఉన్నా...

ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజన్ నడుస్తోంది. కలుపుతీత పనులు ఉన్నాయన్న సాకుతో అధికారులు పలుచోట్ల ఉపాధి పనులు చూపించడానికి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఇప్పుడున్న వ్యవసాయ కార్మికుల సంఖ్యకు అనుగుణంగా వ్యవసాయ పనులు చూపడం లేదు. ఉదాహరణకు ఒక గ్రామంలో సుమారు 250 నుంచి 500 మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారనుకుంటే అందులో ప్రస్తుతం వ్యవసాయ పనులు 30 శాతం మందికి కూడా దొరకడం లేదు. దీంతో మిగిలినవారు పస్తులతో కాలం వెల్లదీస్తున్న పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా కొద్దిరోజులుగా 8 నుంచి 10 వేల మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు 15 వరకు సుమారు 50 వేల మంది వరకు పథకంలో పనులకు వెళ్లేవారు. ఈ నెలలో ఆ సంఖ్య 8 నుంచి 10 వేలకు పడిపోవడంతో కార్మికులు కుటుంబ పోషణకు అష్ట కష్టాలు పడుతున్నారు. తమకు పనులు కావాలని అడుగుతున్నప్పటికీ కాలువల్లో నీరు ఉందని, వ్యవసాయ పనులు జరుగుతున్నాయి అంటూ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు దాటవేస్తున్న పరిస్థితి ఏర్పడింది.

దీంతో లక్ష్యాలకు అనుగుణంగా పథకం సాగడం లేదనేది స్పష్టమవుతోంది. మరో వైపు జిల్లాలో వారాల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. 11 వారాలుగా రూ.54 కోట్ల పైనే పెండింగ్ ఉండగా రెండు రోజుల క్రితం బకాయి వేతనాలు రిలీజ్ అయ్యాయి. పలుచోట్ల ఉపాధి కూలీల ఖాతాలకు జమ కాలేదు. కొందరికి 2 నుంచి 3 వారాలు, కొందరికి 4 వారాల సొమ్ము జమ అయ్యింది. మరికొందరికి ఒక వారం కూడా సొమ్ము జమ కాలేదు. దీంతో పలువురు కార్మికులు పోస్టల్ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా వారం రోజుల వ్యవధిలో మొత్తం బకాయిలు కూలీల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పుకొస్తున్నారు.



నిర్వీర్యం చేసే కుట్ర తగదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతోంది. ఎప్పుడూ లేనంతగా 11 వారాలుగా వేతనాలు ఇవ్వలేదు. అనేకసార్లు వ్యవసాయ కార్మికులు మొర పెట్టుకుంటే ఇటీవల కొన్ని బకాయిలు విడుదల చేశారు. వ్యవసాయ సీజన్ అయినప్పటికీ పనులు ఉండడం లేదు. తక్షణమే అధికారులు స్పందించి అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలి. లేకపోతే ఆందోళన ఉదతం చేస్తాం.

- కెఎస్.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



వ్యవసాయ పనులు లేవు

వ్యవసాయ పనులు సీజన్ అయినప్పటికీ మాకు పూర్తిస్థాయిలో పనులు దొరకడం లేదు. ఉపాధి హామీ చట్టం గత కొన్నేళ్లుగా మాలాంటి వారిని అందర్నీ ఆదుకుంటుంది. కానీ పనులు సక్రమంగా జరగడం లేదు. వేతన బకాయిలు ఉన్నాయి.

- గొర్రెల సూర్యనారాయణ, కూలీ, గండేపల్లి



పనుల కోసం ఎదురు చూస్తున్నాము

ఉపాధి హామీ పథకం పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాం. కొద్దిరోజులుగా సక్రమంగా పనులు దొరకడం లేదు. ఇటీవల రెండు మూడు రోజులు వెళ్ళినప్పటికీ ఆ తర్వాత నుంచి ఖాళీగానే ఉంటున్నాం. అధికారులు స్పందించి ఉపాధి పనులు చెప్పాలి.

- వరుకుర్తి దుర్గ, ఉపాధి కూలీ, గండేపల్లి.

జాతీయ రహదారి విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా సత్వరాభివద్ధి, ప్రజల జీవన వికాసానికి దోహదం చేసే రీతిలో 16వ నంబరు జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణకు ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిని ఆరు లేన్లకు విస్తరణపై నేషనల్ హైవేస్ అథారిటీస్ అధికారులు సిద్ధం చేసిన నివేదికపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ యనమల దివ్య, ఎంఎల్ఎలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, వరుపుల సత్యప్రభ, ఇరిగేషన్, విద్యుత్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీస్ పీడీ రోహిత్ కుమార్ డిపిఆర్ అంశాలను వివరించారు. అనకాపల్లి నుండి అన్నవరం మీదుగా దివాన్ చెరువు వరకు ఉన్న 4 లేన్ల రహదారిని 6 లేన్లతో పాక్షిక ఏక్సెస్ కంట్రోల్డ్ హైవేగా అభివృద్ధి చేసేందుకు తమ సంస్థ డిపిఆర్ రూపొందించిందని తెలిపారు. ప్రతిపాదిత 6 లేన్ల రహదారి కాకినాడ జిల్లాలో తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల్లో 80.600 కిమీలు, తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం మండలంలో 11 కిమీలు మొత్తం 160 కిమీ పొడవునా ఉంటుందని తెలిపారు. కలెక్టర్ షాన్ మోహన్ సగలి మాట్లాడుతూ వంపులు సరిచేసేందుకు, జనావాసాలను తప్పించేందుకు అవసరమైన చోట్ల 60 మీటర్ల వెడల్పున బైపాస్ రోడ్లు ప్రతిపాదించారని, ప్రజల సౌకర్యం కోసం అండర్ పాస్‌లు, ఫ్లయ్ ఓవర్లు, సర్వీస్ రోడ్లను ప్రతిపాదించారని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజా సౌకర్యం, రోడ్డు భద్రత కోసం అవసరమైన మార్పులను ఎంఎల్ఎలు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జె.వెంకట్రావు, ఆర్ అండ్ బి ఎస్ఇ కాంతు, విద్యుత్ శాఖ ఎస్ఇ ప్రసాద్, పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎలతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఆసుపత్రి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ క్లస్టర్ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం రూ.2.80 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బుధవారం ప్రారంభించారు. డిసిహెచ్ఎ డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ స్థానిక ఆసుపత్రిలో మెరుగు పరుస్తున్న వసతులతో ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. రాత్రి సమయాల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అమల, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్ (బాబు), బలుసు వాసు, గొల్తి సత్యనారాయణ, మానవ హక్కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ పాల్గొన్నారు.



ఆసుపత్రి భవనం ప్రారంభిస్తున్న పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప



ముద్రగడను కలిసి తోట నరసింహం

ముద్రగడను కలిసిన తోట

ప్రజాశకి-ప్రత్తిపాడు

మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి తోట నరసింహం బుధవారం కలిశారు. ముద్రగడ తనయుడు, వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గిరిబాబు నరసింహంకు స్వాగతం పలికారు. పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని నరసింహం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట బాజ్జి, రామకుర్తి రామచంద్రమూర్తి, ఆడారి మహేష్, పీలా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలం వెంకటనగరంలో ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, వైసిపి నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు బుధవారం పర్యటించారు. గ్రామానికి చెందిన జాను రాజు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రాజు కుటుంబానికి రూ.5000 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముప్పిడి నూకరాజు, రేస్ ప్రకాష్, కోలా తాతబాబు, తిమ్మిశెట్టి రాజా పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం కోసం ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం నుంచి కుయ్యేరు వెళ్లే రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పదేళ్లగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో అనేకమంది ప్రమాదాలకు గురయ్యారని, ప్రాణాలను సైతం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కాజులూరు రోడ్డు నిర్మాణ సమితి ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టారు. అనంతరం రహదారిని దిగ్బంధించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన తెలిపారు. 300 మంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు. సుమారు 5 గంటల పాటు ఈ కార్యక్రమం జరగడంతో ఆ రోడ్డుపై వెళ్లే పలు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇతర మార్గాల వైపు వాహనదారులు వెళ్లాల్సి వచ్చింది. ఇంత పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా అధికార యంత్రాంగం స్పందించకపోవడం శోచనీయమని గ్రామస్తులు వాపోయారు. నాయకులు మాధవరపు నానాజీ, మాజీ జెడ్‌పిటిసి యాళ్ల సూర్య ప్రకాష్, సలాది నానాజీ, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, యాళ్ల గొల్లబాబు, దంగేటి అరుణ్ కుమార్, నరసింహమూర్తి మాట్లాడారు. పదేళ్లగా గొల్లపాలెం రహదారి పాడైందని, చేదువాడ వంతెన, కాజులూరు వద్ద అంద్రంగి మురుగుకాలువపై వంతెన పాడైందని అనేకసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుంటుంది అనుకుంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జులై 27న ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కాజులూరులో రాస్తారోకో చేయగా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించి ఆగస్టు 5న రోడ్డు పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ నిర్మాణ పనులు మొదలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మరోసారి ఉద్యమ బాట పట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేపకాయల వీరభద్రరావు,నున్న కొండబాబు, బుద్ధాల చంటిబాబు, ఎర్రంశెట్టి కొండ, శిలలంక సర్పంచి నెల్లి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు. కాజులూరు ఎస్ఐ మోహన్ కుమార్, తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు.



ఆందోళనలో పాల్గొన్న ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు



వంటా వార్పు ఆందోళనలో పాల్గొన్న గ్రామస్తులు



మహిళా ప్రతినిధులను సత్కరిస్తున్న సిబ్బంది

ఆదిత్యలో మహిళా ఆరోగ్యంపై సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల, మహిళల ఆరోగ్యంపై ఒక సెమినార్‌ను నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డాక్టర్ నిమ్మకాయల సుజన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం నిర్వాహకుల తరపున ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ డి.సతీష్ కుమార్ మెడికవర్ హాస్పిటల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలో డాక్టర్ హరిత ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి హరిత సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో నిరంతరం సేవలందిస్తున్న 104 సిబ్బంది ఇబ్బందులను తెలుసుకోవడం కోసం 104 డిస్ట్రిక్ మేనేజర్ బాలసుబ్రమణ్యం డిఇఒగా విధులకు వచ్చి వాళ్లకి ఉన్న సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం తెలియజేసే విధంగా భవ్య కంపెనీకి తాను ఎదుర్కొన్న ఇబ్బందులను భవ్య కంపెనీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని, టిడిపి నాయకుడు పోసిన బాబూరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాపురం నారీ సశక్తి పరివార్ అభియాన్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ ఉష అన్నారు. ఆర్‌బి.కొత్తూరులో అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం మహిళల ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నూనె రామారావు, కూటమి నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ, 104 సిబ్బంది, ఎఎన్ఎం, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్లు చంద్ర కిరణ్, ఉష

స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేఫ్ రైడింగ్


ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కెటిఎం అకాడమీ సేఫ్ రైడింగ్ ఈవెంట్‌ను బుధవారం డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రోగ్రాంలో 100 మందికి పైగా విద్యార్థులు ప్రొఫెషనల్ సేఫ్ రైడింగ్, రైడర్ డిసిప్లిన్, మోటర్‌స్పోర్ట్స్ భద్రతా ప్రమాణాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి.కిషోర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌డివివిఎస్.భీమేశ్వర రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు..

రైతు సేవా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చందుర్తిలో బుధవారం పంట పొలాలు, రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెడి రైతులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకూ రెండో దఫా, మూడో దఫా ఎరువులు వేయడానికి సరిపడా యూరియా రైతు సేవా కేంద్రాలు సొసైటీలు ప్రైవేటు దుకాణాల నుంచి సరఫరా చేస్తామన్నారు. మండలానికి రైతు సేవా కేంద్రం నుంచి 90 టన్నులు, ప్రైవేట్ దుకాణం నుండి 60 టన్నులు అందుబాటులో ఉందన్నారు. ఇ క్రాప్ బుకింగ్ ఈనెల 30తో ముగుస్తుందని రైతులందరూ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, ఎఒ కెవివి.సత్యనారాయణ, విఆర్ఒ చంటి రైతులు పాల్గొన్నారు.



గ్యాస్ లీకేజీతో ప్రజలకు అస్వస్థత

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయితీ రెడ్డివారిపాలెంను ఆనుకుని ఉన్న భాస్కర ఐస్ ఇండస్ట్రీస్ నుంచి గ్యాస్ లీకేజ్ వల్ల ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు రక్షణ కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గ్రామస్తులతో కలిసి బుధవారం డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబుకు ఐస్ ఫ్యాక్టరీపై ఫిర్యాదు చేశారు. ఐస్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన అమోనియం గ్యాస్ వల్ల ప్రజలు రాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారని అన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న మూడు పరిశ్రమల నుండి బయటకు వస్తున్న కాలుష్య నీరును బయటికి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు కోరారు. ఈ పరిశ్రమల వలన గ్రామంలో భూగర్భ జలాలు ఉప్పునీరుగా మారిపోయాయని అన్నారు. ఇప్పటికే తాగునీరు కుళాయిలు సక్రమంగా రావడం లేదని రావడం లేదని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో డిటి.సూరిబాబు గ్రామస్తులతో మాట్లాడారు. ఐస్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దంగేటి ప్రసాద్, రెడ్డి వీర్రాజు, కట్టా శ్రీనివాస్, రైతు మట్టపర్తి సత్యనారాయణ, మట్టపర్తి నాగేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, మట్టపర్తి నాగార్జున పాల్గొన్నారు. గ్యాస్ లీకేజ్ అయిన భాస్కర ఐస్ ఇండస్ట్రీస్‌ను జిల్లా అధికారుల బందం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జల శాఖ ఎహెచ్ జి.ప్రసన్న, ఎఫ్‌డిఒ అనురాధ, డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు, కాలుష్య నియంత్రణ మండలి ఎఇ రామచంద్రమూర్తి, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జివివి.సత్యనారాయణ, రాంబాబు, విఆర్ఒ సత్యవతి పాల్గొన్నారు.



అధికారులకు వివరిస్తున్న సిపిఎం నాయకులు



విగ్రహాలను పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు, బొడ్డు సత్యనారాయణ.

నాయకర్, పొన్నమండ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-తాళ్లరేవు

విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్, సామాజికవేత్త పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవలు స్ఫూర్తిదాయకమని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ అన్నారు. అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం ఆధ్వర్యంలో కోరంగి వై.జంక్షన్‌లో బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపం ఎదురుగా త్వరలో ఏర్పాటు చేయనున్న కాంస్య విగ్రహాలను వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ అందరితో సంప్రదించి విగ్రహాల ప్రారంభోత్సవానికి త్వరలో తేదీ నిర్ణయిస్తామని తెలిపారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు బొడ్డు సత్యనారాయణ రెండు సెంట్లు స్థలాన్ని దానం చేయడమే కాక, విగ్రహాల మండపం నిర్మాణం చేయించారని అన్నారు. వైదాడి నూకరాజు, దండుప్రోలు నాగబాబు, వాడ్రేవు వీరబాబు, బర్రె లక్ష్మి నరసింహరాజు, వైదాడి శ్రీనివాస్, దండుప్రోలు శ్రీను, కాలాడి కామేశ్వరరావు, బొమ్మిడి శేఖర్, సంగాడి శ్రీను, పొన్నాడ బాబీ పాల్గొన్నారు.

యూరియా అమ్మకాలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తిలోని శ్రీనాగ దుర్గ ఏజెన్సీస్ ప్రైవేటు దుకాణంలో అధిక ధరకు యూరియా విక్రయించకుండా బుధవారం 30 టన్నుల యూరియాను ఎఒ కెవివి.సత్యనారాయణ సమక్షంలో రైతులకు అమ్మకాలు సాగించారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఒ సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు కేటాయించాలి

ప్రజాశక్తి -కరప

కాకినాడలో కాలేజీలకు వెళ్లేందుకు వేళంగి, నడకుదురు వరకూ విద్యార్థులకు ప్రత్యేక బస్సులు కేటాయించాలని కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఎంఎల్ఎ పంతం నానాజీని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ పంతం నానాజీని కోరాగా ఆయన వెంటనే సంబంధిత ఆర్‌టిసి డిపో అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇద్దరిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇద్దరు వ్యక్తులు కొట్టుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన వేగేశ్న వెంకట సత్య ప్రసాద్ రాజు మరియు వేగేశ్న వెంకట కృష్ణంరాజు బుధవారం రావిచెట్టు సెంటర్లో ఒకరినొకరు దుర్భాష లాడుకుని కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు స్థానిక స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. వారి ఫిర్యాదులు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

సాంబమూర్తి మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

సీనియర్ ఎలక్ట్రికల్ వర్కర్ అల్లు సాంబమూర్తి (63) బుధవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలలో ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, అధ్యక్షులు తాడిశెట్టి గంగ, లంక చంటి, జోకా సూర్యనారాయణ, మదిని దుర్గాప్రసాద్, బాషా, విష్ణు ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు.

జాబ్ మేళాలో 27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళాలో 27 మంది ఉద్యోగాలు సాధించినట్టు ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లేబ్యబరేటరీస్ లిమిటెడ్ ఫార్మా కంపనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో కళాశాల పూర్వ విద్యార్థులు, తృతీయ సంవత్సర విద్యార్థులు, తదితర అభ్యర్థులు మొత్తం 52 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. వారిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-కోటనందూరు

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానాలపై బుధవారం జిల్లా సివిల్ సప్లై ట్రైనింగ్ అధికారి దుర్గాప్రసాద్ రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ధాన్యం నాణ్యత, ధాన్యంలో తేమ, ఎ గ్రేడ్, బి.గ్రేడ్ విభజన వాటిపైన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏడాదికి 17 గ్రామ పంచాయతీల్లో 9,500 ఎకరాలకు పైగా ఖరీఫ్ సాగు చేసినట్టు మండల విస్తరణాధికారి జగ్గ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు మరిచారు..

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలోని బలుసుల పేటకు చెందిన సుమారు 120 మందికి గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలను జారీ చేసి, ఇప్పటి వరకు ఎటువంటి ఇంటి స్థలం చూపించ లేదని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు అన్నారు. తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డికి ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో వారి ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. హరిబాబు మాట్లాడుతూ బలుసుల పేటకు చెందిన సుమారు 120 మంది దళిత ప్రజలకు లేఅవుట్4, లే అవుట్ 9లో ఇళ్ల స్థలాలు మంజూరైనట్టు పట్టాలు ఇచ్చారన్నారు. వారికి ఇళ్ల స్థలాలు చూపించి ఇంటిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మహిళలు, గర్భిణులు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని కాండ్రకోట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ ఉష అన్నారు. బుధవారం రాయభూపాలపట్నంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాలలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వారు గర్భిణులకు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టివి.రమణమ్మ, సర్పంచ్ అడ్డాల మరియమ్మ, చీకట్ల లక్ష్మి, నూనె రామారావు, వల్లూరి సోమనాథ్, సబ్బినీడి హరిబాబు పాల్గొన్నారు.

ఎఎస్‌డి కళాశాలలో ఆర్గానిజమ్స్ డే

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జగన్నాథపురంలోని ఎఎస్‌డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ మైక్రో ఆర్గానిజమ్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రపంచంలో మైక్రోబయాలజీ ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడానికి మైక్రోబయాలజీ విభాగం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్ఐఎఫ్‌టి నుంచి మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి.కిరణ్ కుమార్‌ను అతిథిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంత లక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐక్యు ఎసి కో ఆర్డినేటర్ వసంతలక్ష్మి, జయశ్రీ, శాఖ అధ్యాపకులు కె.లలిత పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-పిఠాపురం

చిత్రాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సిడిఎఒ దుర్గాదేవి ఆధ్వర్యంలో బాలబాలికలకు చట్టాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి హాజరై బాలల హక్కులపై వివరించారు. లైంగిక వేధింపులు, మంచి స్పర్శ చెడు స్పర్శ, బాలల సంబంధిత చట్టాలు తెలియజేసి చైల్డ్ హెల్ప్ లైన్, 1098 పని తీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసంత కుమారి, గ్రామ మహిళా కార్యదర్శి బి.సత్యదేవి పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని జి.వేమవరంలో సర్వే నెంబర్ 73లో ఎకరం 15 సెంట్ల శ్మశానం భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అనుకూలి బాబూరావు, అనుకూలి శ్రీనివాసరావు బుధవారం డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సంబంధించిన శ్మశానం భూమిని కొందరు ఆక్రమించి క్రయ, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. సుమారు 120 ఏళ్లకు పైబడి రెవెన్యూ రికార్డుల్లో శ్మశానంగా నమోదై ఉన్న భూమిని ఆక్రమిస్తున్న వ్యక్తుల నుంచి శ్మశానం భూమిని కాపాడాలని కోరారు.

యానాం వార్తలు



స్వచ్ఛ భారత్ లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా వికాస్ దివస్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వికాస్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఐటిఐ ఆవరణలో విద్యార్థులతో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల గోవింద జయరామారావు, గోపి సురేష్, ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, తిర్రి గోపి, ఆనంద్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పలువురికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు, ఉదయలక్ష్మి దంపతుల 42వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బెజవాడ గార్డెన్స్‌లోని అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్స్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. స్థానిక యత్రా గార్డెన్స్‌లోని మల్లాడి స్వగృహం వద్ద అభిమానులు భారీ కేక్ కట్ చేసి మల్లాడి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్ఎఒకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

దొమ్మేటి పేటలో మురికి కాలువ పరిశీలన

ప్రజాశక్తి - యానాం

దొమ్మేటి పేటలో మురికి కాల్వను ఆర్ఎఒ అంకిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సేవా సమితి కో ఆర్డినేటర్ దుగ్గుదుర్తి అనితతో కలిసి గ్రామస్తులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ప్రధాన మురికి కాలువ వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలు పరిశ్రమలు ఆ కాలువలోకి ప్రమాదకరమైన రసాయనాలు వదలడం వల్ల తాము అనారోగ్యానికి గురికావడమే కాక ఇంట్లో ఉండే సామాన్ల సైతం రంగు మారుతున్నాయని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఇతరులు



పెరియార్ రామస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

పెరియార్ ఇవి రామస్వామి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఆయన విగ్రహానికి ఆర్ఎఒ అంకిత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ అడలరసన్, కొల్లు ప్రసాద్, హంసాని రామలక్ష్మణుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు



పిల్లారాయ ఆలయం వద్ద భారీ అన్నదానం


ప్రజాశక్తి- యానాం

యానాంలో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక పిల్లారాయ వీధిలో ఉన్న పిల్లారాయస్వామి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. తొలుత పిల్లారాయ సేవా సమితి కమిటీ సభ్యులు ఆ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్ఎఒ అంకిత్ కుమార్, డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి వీర్రాజు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపిడిఒగా వెంకట సూర్యనారాయణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎంపిడిఒగా బుధవారం కె.వెంకట సూర్య నారాయణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏలేశ్వరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహించిన సూర్యనారాయణ ఉద్యోగోన్నతిపై పెద్దాపురం వచ్చారు. డిప్యూటీ ఎంపిడిఒ శేఖర్ రెడ్డి, కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎంఎల్ఎ చినరాజప్పను కలిసిన ఎంపిడిఒ

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కూటమి ప్రభుత్వం భూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని వైసిపి మండల అధ్యక్షుడు అనాల సుదర్శన్ అన్నారు. బుధవారం పాత ఇసుకపల్లి, కొండేవరంలో గుల్లపల్లి వీరభద్ర రావు, గాది గంగబాబు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను, అమలు అవుతున్న విధానం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే వాటి అమలకు గ్రామస్థాయి నుండి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంగలి సుబ్బారావు, ఎరకం దివాకర్‌రెడ్డి, గుర్రాల తాతారావు, ఇంటి బాబ్జి, గొర్ల పోతన్న, కూతా నాగిరెడ్డి, మేడిశెట్టి శ్రీరాములు, వేమగిరి నాని, వాసంశెట్టి సూర్య ప్రకాష్, గాది సత్య, గుల్లపల్లి వెంకటరమణ, గుర్రాల ఎలీనా, అనపర్తి నాని, బొబ్బరాడ గంగాధర్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

వేతన చర్చలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో డైట్ విభాగంకార్మికుల కమిటీ సమావేశం ఏచూరి శంకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రెండేళ్లకు ఒకసారి ఒకసారి వేతనాలు పెంపు ఉంటుందని, ప్రస్తుతం వచ్చిన డైట్ కాంట్రాక్ట్ వారు కార్మికులు లేఖ రాసినా స్పందించలేదన్నారు. వేతనాల పెంపుదల విషయమై జిజిహెచ్ అధికారులు దృష్టి పెట్టి కాంట్రాక్టు సంస్థతో మాట్లాడి వేతన ఒప్పందం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఏడుకొండలు, వై.శ్రీను, రాజశేఖర్, వీరబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు వెంకటరమణ

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వాసుపత్రిలో వివిధ పరీక్షల నిమిత్తం, వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా కరెడ్ల దేవి, బిజెపి నేతల సహాయ సహకారాలతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాజా సూరిబాబు రాజు, దుర్గా మోహన్‌రావు, రామ్ కుమార్, పెన్నాడ జగన్నాథం, చెరుకూరి రవి రత్నం, భార్గవి, దువ్వా గంగాభవాని, వెంకటపతి, విత్తనాల వెంకటరమణ, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో రోజువారీ పారిశుధ్య నిర్వహణ లేకపోవడం వల్ల మురుగు నీరు దుర్గంధం ఎక్కువయ్యిందని పౌర సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు తెలిపారు. రోడ్ల మీద చెత్తలు ఎక్కువగా దర్శన మిస్తున్నాయన్నాయని, అధికారులు ప్రజాప్రతినిధులు వుండే ప్రాంతాలు మినహా ఇతర మురికివాడల్లో చెత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయిన దుస్థితి ఉందన్నారు. నగర జనాభాకు తగిన పారిశుధ్య సిబ్బంది లేకపోవడం వల్ల రోజువారీ పారిశుధ్య నిర్వహణ లేదన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - సామర్లకోట

వెనకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డివిజన్ ఉప విద్యా శాఖధికారి కెవివి.సత్యనారాయణ ఆదేశించారు. సామర్లకోట సిబిఎం ప్రాథమిక పాఠశాలను సత్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల ఎకడమిక్ అంశాలను పరిశీలించారు. ఆగస్టులో ఫార్మేటివ్, అసెస్మెంట్ పరీక్ష సంబంధించిన పరీక్ష పేపర్లను ఆయన పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం సుగుణమణికి పలు సూచనలు చేశారు. పాఠశాలలోని అందరు విద్యార్థులు చదివేలా, రాసేలా తయారు చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారుపాయన వెంట ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య హెచ్‌ఎంలు మూర్తి, సుగుణమణి ఉపాధ్యాయులు ఉన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ

వైద్య చికిత్స నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం జగన్నాథపురం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతిస్తూ పాలన సాగిస్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలల కాలంలోనే కాకినాడ అర్బన్ నియోజకవర్గం నందు పలు దఫాలుగా సుమారు రూ.5 కోట్ల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించినట్టు తెలిపారు. గదుల సాయిబాబా, ఎస్‌కె.రహీమ్, చింతలపూడి రవి, పిర్ల లక్ష్మీ ప్రసన్న, పొంగా బుజ్జి, ముత్యాల రాణి, పాలిక నాని, అమలకంటి బలరాం, నీలకాయల సన్నీ కిరణ్, రెడ్నం సత్తిబాబు, దంగేటి సతీష్, బొల్లోజు ఉమ, కోలా ఎల్లారావు, విస్సంశెట్టి బాబ్జి, కాళ్ల సత్తిబాబు, చౌదరి, పి.కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 239 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుండి అక్టోబరు 16 వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా సిడిపిఒ జి.ఉష ఆధ్వర్యంలో సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప, కుడా చైర్మన్ తుమ్మలరామ స్వామి సమక్షంలో ప్రతిజ్ఞతో ఈ కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని దుర్గగుడి, కొత్తూరు, సంగీతరావుపేట, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు ఎస్.ఉమాదేవి, ఎఎన్‌ఎం శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, రత్నకుమారి, సత్యవతి, నాగ రత్నకుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

రైతుల విషయంలో ఇబ్బందులు పెట్టవద్దు

ప్రజాశక్తి -కరప

రైతుల విషయాల్లో ప్రతిపక్షాలు ఇబ్బందులు పెట్టవద్దని ఎంఎల్ఎ పంతం నానాజీ సూచించారు. బుధవారం ఎపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేంలో ఆయన మాట్లాడారు. కరప మండలంలోని యూరియా కొరత లేదని, ముంపునకు గురికాకుండా పంట పొలాలు తడి ఆరకుండా అందరి సహకారంతో చేశామని ఎంఎల్ఎ తెలిపారు. ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి మూడు నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన ప్రగతిని, చేపట్టబోయే పనులను వివరించారు. పిహెచ్‌సి హెచ్ఎస్ టివి.రమణారావు, ఎఒ సత్య, హౌసింగ్ డిఇ నాగభూషణం వివరాలు వెల్లడించారు. డిప్యూటీ తాసిల్దార్ దుర్గాప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వర్ధన్, హౌసింగ్ ఎఇ నగేష్, పంచాయతీ రాజ్ జెఇ శైలజ, ఎపిఎం దేవి, సొసైటీ అధ్యక్షుడు దూడల నారాయుడు, సైనవరపు భవానీ శంకర్ పాల్గొన్నారు.

వైసిపిని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-రౌతులపూడి

గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు వైసిపిని బరోపాతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు కోరారు. బుధవారం మండలంలోని దిగువాసివాడ, గంగవరంలో సమావేశాలు నిర్వహించారు. మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీ శివకుమారి, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, సర్పంచ్‌లు కొరుప్రోలు దేవుడు బాబు, సైపురెడ్డి వెంకటరమణ, నాయకులు వాసిరెడ్డి భాస్కర్ బాబు, గొల్లు వెంకటరమణ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు సాయం అందిస్తున్న క్లబ్ సభ్యులు

పేద విద్యార్థులకు సాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘ భవనంలో తాళ్ళరేవు వాసవి క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ముగ్గురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు నున్న శైలజ, కుర్మదాసు ఝాన్సీ, అద్దేపల్లి లక్ష్మి, కుర్మదాసు వీరేంద్ర, పేపర్ బాయ్ వీరబాబు, పత్రికా విలేకరులు, వాసవి క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ సామా ప్రకాష్, సామా సర్వలక్ష్మి, ఇంజనీర్ కంచర్ల ప్రవీణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కుర్మదాసు భారతి, సెక్రటరీ చెక్కా సువర్ణ, ట్రెజరర్ వరదా జయశ్రీ, గోకవరపు సుభాష్, అద్దేపల్లి సత్తిరాజు, నున్న దత్తు, అత్తులూరి శ్రీను, కుర్మదాసు శ్రీను, వరదా శేషయ్య, సామా భగవాన్, కంచర్ల రామోజీ పాల్గొన్నారు.